# సాహితీ పెత్తందార్లు

అది తెగులూరే తెలుగు ఊరు. అక్కడే రావి చెట్టు క్రింద, రచయితలూ సంపాదకులూ ప్రచురణకర్తలూ విమర్శకులూ కూర్చుని ఎదురు చూస్తున్నారు.

అప్పుడే వచ్చాడు సాహితీ పెత్తందారు. పేరు రాయని భాస్కరుడు. ఆరడుగుల పొడుగు, నోట్లో చుట్ట. చుట్ట తీసి భుజం మీద గద పెడితే, తెలుగు సినిమాల్లో దుర్యోధనుడిలా వుంటాడు. పెత్తందారు ఒకసారి అటూ ఇటూ పచార్లు చేసి, ఒక చోట ఆగాడు. అక్కడ సంపాదకులు కూర్చుని వున్నారు. 'ఏమయింది. మన కథల పోటీ? మంచి కథలేమన్నా వచ్చాయా?' అని అడిగాడు.

'వచ్చాయండీ చక్కటి కథలు. ఎంతో కొత్తదనంతో గొప్పగా వ్రాశారు. కొంతమంది రచయితలు మంచి ప్రయోగాలు కూడా చేశారు. నాకు ఆనందంగా వుంది వాటి నాణ్యత చూసి. కొన్నయితే అక్షర లక్షలు... ' అన్నాడు ఒకటో సంపా.

అతని మాటలకడ్డం వస్తూ అన్నాడు రెండో సంపా 'పోదురూ మరీ బడాయి. కొన్ని బాగున్నట్టే వున్నాయి కానీ కథనం లేదు. కథనం బాగుంటే శిల్పం లేదు. రెండూ బాగుంటే భాష బాగా లేదు. ఇవన్నీ బాగుంటే ఏమిటో ఏదో అసంతృప్తి'

'మీరు చెప్పిన దాంతో మేం అంగీకరిస్తున్నాం. అందుకే ఏ కథా బహుమతికి అర్హం కాదని మా మాటగా చెప్పండి' అన్నాడు రాయని భాస్కరుడు, లావుపాటి నడుం మీద తన మందపాటి చేతులు వేసుకు నుంచొని.

'నేను ఒప్పుకోను. గొప్ప కథలు వచ్చాయి. కొన్ని నాకు బాగా నచ్చాయి. ప్రకటించిన దాని ప్రకారం బహుమతి ఇస్తే బాగుం.. ' మొదటి సంపా అంటున్నాడు.

పెత్తందారుకి కోపం వచ్చింది. 'మేం వద్దని చెబుతుంటే మీరు కాదంటారేమిటి. మాకు అడ్డు తొలగండి. మొదటి బహుమతికి ఏ కథా అర్హమైనది కాదని చెప్పండి. ఏ రెండు మూడు కథల్నో ఎంచుకుని ప్రోత్సాహ బహుమతులివ్వండి. మేం చెప్పినట్టు చేయండి. ఈనాడు ఇక్కడ సాహిత్యాన్ని నేనే నడిపిస్తున్నాను... ' అన్నాడు.

'మీరా సాహిత్యాన్ని నడిపిస్తున్నది! ఆధునిక సాహిత్యం గురించి శ్రీశ్రీగారు అన్నట్టున్నారు ఆ మాట... '

'ఎవరది? నా మాటకి ఎదురు చెబుతున్నది - నేను చెబుతున్నట్టుగా మీరు వ్రాయాలి. మీ భావాలతో నాకు పని లేదు' గర్జించాడు భాస్కరుడు.

'అది రచయితలు కూర్చున్న చోటునించే వచ్చింది దొరా. అతని పేరు రావెల సేతుమాధవరావు.. రాసేరావు అని కలం పేరు... '

రాసేరావు నెమ్మదిగా అన్నాడు 'గొప్ప నవలలు వ్రాసిన నా అభిమాన తాత్విక రచయిత గోపీచంద్ ఒకసారి తన గొంతుతో చెప్పిన టేప్ నా దగ్గరవుంది. సరిగ్గా ఆయన మాటల్లో కాకపోయినా నా మాటల్లో చెబుతున్నాను. ఒక చిన్న పిల్లవాడు పరుగెత్తుతూ క్రింద పడ్డాడుట. అది చూసిన పెద్దమనిషి తనలో తనే అయ్యయ్యో అనుకున్నాడు. ఇంకో పెద్ద మనిషి, అరె పిల్లాడు క్రింద పడ్డాడు. పైకి

తీయండి అన్నాడు. అక్కడే వున్న ఒకావిడ - దెబ్బ తగిలిందేమో చూడు నాయనా అంది. వంటింట్లోనించీ అది చూసిన పిల్లాడి తల్లి - వెధవా ఎన్నిసార్లు చెప్పాలి అలా పరుగెత్తవద్దని అన్నది. పేపర్ చదువుకుంటూ కూర్చున్న పిల్లాడి నాన్న, విసుగ్గా లేచి పిల్లాడి వీపుమీద రెండు దెబ్బలు వేశాడు. హోం వర్క్ చేసుకుంటున్న పిల్లాడి అక్క వచ్చి, వాడిని లేవదీసి ముద్దు పెటుకున్నది. ఇక్కడ జరిగినది ఒకే ఒక్క సంఘటన. ఎంతమంది ఎన్ని రకాలుగా స్పందించారో చూడండి. కొంతమంది మనసులో అనుకుంటే, కొంతమంది అసంకల్పంగానూ, కొందమంది కావాలనీ భావాలని పైకి చెప్పారు. అతని అక్క ఏమీ చెప్పకపోయినా తన స్పందన చేతల ద్వారా చూపించింది. అదే ఒక రచయిత అయితే తన భావాలు వ్రాసి వుండేవాడు... స్పందన ఒకరు చెబితే వచ్చేది కాదు. శ్రీశ్రీ మహాప్రస్థానం చదివి ఆ శబ్ద సౌందర్యానికీ వేగానికీ ఆవేదనకీ అబ్బురపడి ఒకాయన అడిగాడుట ఇంతటి మహా కావ్యాన్ని ఎలా వ్రాయగలిగారండీ అని. దానికి శ్రీశ్రీ ఇచ్చిన జవాబు, అది నేను వ్రాయలేదు. ఆకలేసి కేకలేశానని. అలా పుట్టింది కనుకనే అది మహాకావ్యమైంది'

'ఏమిటో మీ రాతలే కాదు, మాటలూ అర్థం కావు. కథంటే కొన్ని విలక్షణమైన లక్షణాలుంటేనే బహుమతులొచ్చేది. వస్తువు కథనం శిల్పం ముగింపు.' అన్నాడు విసుగ్గా రాయని భాస్కరుడు.

రాసేరావు అన్నాడు, 'దానికి నేను ఒప్పుకోను. కథకి ముఖ్యమైన లక్షణాలు మూడే మూడు. ఒకటి, మొదలు పెట్టేక తనంతట తానే చివరిదాకా చదివించు కోవటం. రెండు, కథ చదివాక ఒక మంచి కథ చదివామనే తృప్తి. అనుభూతి. మూడవది, చదివాక ఎన్నాళ్ళో అలా మనసులో ముద్రించుకు పోవటం. మొదటి లక్షణం వున్న కథ చక్కటి కథ. మొదటి రెండు లక్షణాలూ వున్న కథ ఎంతో మంచి కథ. ఈ మూడు లక్షణాలూ వున్న కథ మరుపురాని గొప్ప కథ. అంతేకాదు, లక్షణాల వలయంలో చిక్కుకుంటే, కథల్లో ప్రయోగాలూ కొత్తపుంతలూ ఎక్కడనించీ వస్తాయి. కథలకి లాక్షణీకులు చెప్పే లక్షణాలు అవసరమైన పరిధిలో వాటంతటవే లక్షణంగా వస్తాయి. రాచకొండ బీనాదేవి ముళ్ళపూడిలాటి వారి కథల్లో ఈ లక్షణా లన్నీ కొలిచి మీరనుకున్న పాళ్ళల్లో వేయటానికి ఇదేమీ పులుసులో పోపు కాదు'

'మీరు మాతో అధికంగా మాట్లాడుతున్నారు. ఇంత అహంకారమా?'

రాసేరావు నెమ్మదిగా అన్నాడు 'అంతేకాదు. రచయిత వ్రాసిన దాన్ని మీరు చెప్పినట్టు తిరగవ్రాయమని చెప్పటానికి మీరెవరు. రచయిత స్వతంత్ర భావాలూ, భాషా స్పందనా ఏమయిపోతాయి. మీభావాలే వుండాలనుకుంటే మీరే రాసుకోవచ్చు కదా. రచయిత కథ వ్రాసి మీ అభిప్రాయం అడిగితే అది వేరు. అప్పుడు కూడా సూచనప్రాయంగా సలహా ఇవ్వాలే కానీ, మార్పులు చేయకపోతే ప్రచురణకి తీసుకో మని మీ భావాలతో బెదిరించి కాదు'

పెత్తందారుకి వీర కోపం రావటం చూసి అన్నాడు ఒక ప్రచురణ కర్త. 'అందుకే ఇలాటి వారి కథలు మన వార్షిక కథా సంకలనాలలో వేయటం లేదు సార్. అంతే కాదు, తెలుగులో ఇప్పటిదాకా వచ్చిన వంద మంచి కథలు అని నేనూ

మీరూ ఎంతో కష్టపడి ఒక లిస్టు తయారుచేశాం గుర్తుందా. దానికి కూడా గొడవే. మీకిష్టమైన వంద కథలని వ్రాసుకోండి కానీ ఇవే వంద మంచి కథలు అని వ్రాస్తా రేమిటి అని. సాహితీ పెత్తందార్లనే దబాయిస్తున్న వీళ్ళని ఒక పట్టు పట్టాల్సిందే'

'అవును. మనం వద్దన్న కథని ప్రచురించాడని ఒక పత్రికా సంపాదకుడిని ఉద్యోగంలోనించీ పీకేసి చిత్తూరులో పాఠాలు చెప్పుకోమని ఇంటికి పంపించేశాం'

'ఇటువంటి విషయాలు ఏమైనా వుంటే నాకు చెప్పండి. నేను చూసుకుంటాను కదా! మీ నుదిటి మీద ఎందుకా చెమట బిందువులు' అన్నాడు విమర్శకుడు.

'తెలుగులో చక్కటి విమర్శలు లేవని విమర్శ వుంది. కథ వ్రాసింది మన వాడయితే పొగిడేస్తామనీ, కాకపోతే తిట్టేస్తామనీ. అందుకే పోయినసారి ఒక కథల పుస్తకం సమీక్షిస్తూ ఎంతో పరిశీలన చేశాను. అందులోవున్న ఇరవై తొమ్మిది కథల్లోనూ, ఎన్ని ఆంధ్రా కథలూ, ఎన్ని తెలంగాణా కథలూ, ఎన్ని రాయలసీమ కథలూ, ఎన్ని ప్రవాస కథలూ, ఎన్ని లెఫ్టూ, ఎన్ని రైటూ, ఎన్ని రాంగూ.. '

'అంతేకానీ కథలని సమీక్షించలేదా? ఇజాలేకానీ మీకు నిజాలు అక్కర్లేదా?' అడిగాడు అమాయకుడు, అమాయకుడు కాబట్టి అమాయకంగా.

'కథల గురించి మనం ఎందుకు వ్రాయటం. చదివేవాళ్ళకి తెలీదూ... '

'రచయిత భావాలతో మనం ఏకీభవించకపోయినా, కథ చెప్పిన విధానం మనకి రుచించకపోయినా, అది చెత్త కథ అవుతుందా? మీ నీలం చొక్కా మీకిష్టం, నా తెల్ల చొక్కా నాకిష్టం. దానికోసం నోటికొచ్చినట్టూ ఏకిపారేయటమేనా?' అన్నాడు మళ్ళీ అమాయకుడు.

'అందుకే పరిశీలనాత్మకంగా రాశాను. అలాగే కొన్ని బహుమతులు వచ్చిన కథలు. నచ్చకపోతే ఆ బహుమతులు ఇచ్చిన వాళ్ళ మీదా, తీసుకున్నవాళ్ళ మీదా ఏదో వంక పెట్టి బురద పూసేయటమే' అన్నాడు విమర్శకుడు.

అమాయకుడికి చిన్నప్పుడు వాళ్ళ వూళ్ళో గుండమ్మ కథ సినిమా వచ్చినప్పటి సంఘటన గుర్తుకి వచ్చింది. విజయవాడ గవర్నర్‌పేట సెంటర్‌లో దాదాపు ముప్ఫై అడుగుల ఎత్తున నాగేశ్వరావు, రామారావు అన్నదమ్ముల్లా నుంచున్న పెద్ద కటవుట్ నిలబెట్టారు. రామారావ్ అభిమానులు స్వచ్ఛమైన గోమాత పేడ తీసుకు వచ్చి, (స్వచ్ఛమైనది గోమాత, పేడ కాదు) తమ స్వంత చేతులతో నాగేశ్వరావు మీద పులిమేశారు. మేం తక్కువ తిన్నామా అని నాగేశ్వరావు అభిమానులు అంత కన్నా క్వాలిటీ కొంచెం తక్కువ వున్న పేడని తెచ్చి ఎంటీవోడి నిలువెత్తు విగ్రహం మీద ఎంప్టీ చేశారు. దాని ఫలితం ఏమిటంటే చక్కటి పైంటింగ్ పాడవటమే కాదు. గవర్నర్‌పేట సెంటర్‌కి మళ్ళీ గవర్నర్‌గారు రాకుండా ఎన్నో రోజులు ఆ వాతావరణమే కంపుకొట్టింది. కాకపోతే అమాయకుడికి అమాయకుడు కాబట్టి ఒక అనుమానం. స్వర్ణకమలం సినిమాలో వెంకటేష్‌లా ఎంతో కష్టపడి ఆ బొమ్మని అంత చక్కగా గీసిన చిత్రకారుడు, తన సృష్టి మీద పూసిన ఆ బురద మరకలని చూసి ఎంత బాధ పడతాడూ అని!

0 0 0